క్లుప్తంగా

లోతట్టు ప్రాంతాల్లో నీటిని వెంటనే బయటకు పంపాలి

అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

నెహ్రూనగర్: తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు వెంటనే చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి అధికారుల్ని ఆదేశించారు. తుఫాన్ అనంతరం నగరంలో తాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని బయటకు పంపడం తదితర అంశాలపై బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులంతా తమ పరిధిలోని ప్రాంతాల్లో సాధారణ పరిస్థితుల్ని తీసుకు రావడంపై దృష్టి పెట్టాలని చెప్పారు. వ్యాధులు ప్రబలకుండా లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, బ్లీచింగ్ చల్లాలని ప్రజారోగ్య అధికారుల్ని ఆదేశించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో డ్రెయిన్లలో పూడిక తీయించామని, పెండింగ్ ఉన్న ప్రాంతాల్లో సచివాలయాల వారీగా తీయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపడానికి ఏఈల వారీగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. డ్రెయిన్ల మీద ఆక్రమణల్ని వారం రోజుల్లో తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని ఆదేశించారు. కృష్ణానదికి వర్షాల వల్ల నీరు కొంత బురదతో వస్తుందని, నగర ప్రజలు తాగునీటిని కాచి, వడ కట్టుకొని తాగాలని ఆమె సూచించారు. నగరంలో ఇంకా ఎక్కడైనా నీరు నిలిచి ప్రజా జీవనానికి ఆటంకం కలిగినా, చెట్లు పడిపోయినా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863–2345103కి ఫోన్ చేయాలని ఆమె తెలిపారు.

ఎండీయూ ట్రక్ ఆపరేటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న ఎండీయూ (రేషన్ బియ్యం వాహనం) ట్రక్ ఆపరేటర్ నియామకానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 88 మంది వాహన డ్రైవర్లకు గానూ ఒకరు రాజీనామా చేశారని పేర్కొన్నారు. డిసెంబర్ 1 , 2023 నాటికి 21 నుంచి 45 ఏళ్లలోపు వయస్సు, 7వ తరగతి ఉత్తీర్ణత, నెలకు రూ.12వేల కుటుంబ ఆదాయంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ఎస్సీ, ముస్లిం మైనార్టీ (బీసీ–ఈ) అర్హులని ఆమె తెలియజేశారు. గుంటూరు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని ఉపా సెల్ విభాగంలో ఈ నెల 7 నుంచి 11 వరకు దరఖాస్తును అందజేసి రసీదు పొందాలని సూచించారు. దరఖాస్తుదారులు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం, ప్రభుత్వ పింఛను, సొంతంగా, వ్యాపార నిమిత్తంగా నాలుగు చక్రాల వాహనంతో పాటు ఆదాయ పన్ను చెల్లించేవారు ఈ పథకానికి అనర్హులు అని పేర్కొన్నారు. దరఖాస్తుకు ఆధార్, రేషన్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ, డ్రైవింగ్ లైసెన్స్‌ల ఫొటోస్టాట్ కాపీలు జత చేయాలని కమిషనర్ తెలిపారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని మొత్తం 207 వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 58 వలంటీర్ల పోస్టుల్ని భర్తీ చేసేందుకు గురువారం అన్ని వార్డు సచివాలయాల్లోని నోటీసు బోర్డుల్లో వివరాల్ని ప్రదర్శిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై (ఆధార్ కార్డులోని పుట్టిన తేదీ, 10వ తరగతి సర్టిఫికెట్‌లోని పుట్టిన తేదీ ఒకటై ఉండాలి), నవంబర్ 30, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండి, 35 సంవత్సరాలు మించని వారై ఉండాలని సూచించారు. దరఖాస్తుదారుని ఆధార్ కార్డు చిరునామా సంబంధిత మున్సిపాలిటీ పరిధిలో ఉండాలని పేర్కొన్నారు. డిసెంబర్ 8 నుంచి 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 12న దరఖాస్తుల పరిశీలన, 13న మౌఖిక పరీక్షలు నిర్వహించి అభ్యర్థుల్ని ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఎంపికైన వార్డు వలంటీర్లు డిసెంబర్ 18 నుంచి విధుల్లోకి చేరాల్సి ఉంటుందని ఆమె తెలియజేశారు.

ముంపు పంటల పరిశీలన



గుంటూరు రూరల్: వాగులు పొంగి ముంపునకు గురైన మిర్చి, పత్తి, ఇతర పంటలను దాసుపాలెం సర్పంచ్ ఎదురుపాక వెంకట్ బుధవారం వ్యవసాయ శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ ముంపునకు గురైన పంటల్లో నీటిని వెంటనే బయటకు పంపాలని తెలిపారు. ముంపు ప్రభావం నుంచి పంటలు తట్టుకునేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు రైతులకు తెలిపారు.

●రూరల్ మండల జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, మండల అధికారులు బుధవారం ప్రజాప్రతినిధులతో కలసి మండలంలోని చిన్న పలకలూరు, దాసుపాలెం, మల్లవరం, తురకపాలెం, తోకావారిపాలెం గ్రామాల్లో నీట మునిగిన మిర్చి, పత్తి, మినుము, పుగాకు తోటల్ని పరిశీలించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యంతో మాట్లాడారు. ఆయన సూచనల మేరకు సకాలంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతుల్ని రైతులకు తెలియజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు రైతులు, ప్రజల సమస్యలపై స్పందించి సత్వర చర్యలు చేపట్టారు.

సమున్నత రాజ్యాంగం అంబేడ్కర్ దార్శనికతకు నిదర్శనం

- వాడవాడలా ఘన నివాళి
- పలుచోట్ల విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు

గుంటూరు మెడికల్/గుంటూరు ఎడ్యుకేషన్/పట్నంబజారు/ కొరిటెపాడు/నెహ్రూనగర్: బడుగు, బలహీనులు, పేదల పక్షపాతిగా, భవిష్యత్తులో దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. ఆమె బుధవారం నియోజకవర్గంలోని 17, 55 డివిజన్ల పరిధిలోని అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ అంటరానితనంపై అలుపెరగని పోరాటం చేసి, దళిత, గిరిజన, మహిళల, కార్మికుల హక్కుల కోసం అవిశ్రాంత కృషి చేసిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. సమాజంలో అన్ని వర్గాలకు సమాన హక్కులు ఉండేలా రాజ్యాంగాన్ని రచించించారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అంబేడ్కర్, వంశీ, అగ్గిపెట్టె రాజు, నాగేశ్వరరావు, సల్మాన్, జేపీరెడ్డి, రవిరాజ్, విజయ్, కిరణ్ పాల్గొన్నారు.

- అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం గుంటూరు లాడ్జి సెంటర్‌లో ఆయన విగ్రహానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్, గుంటూరు తూర్పు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, చరకా కుమార్‌గౌడ్, దారా అంబేడ్కర్, మేరి సరోజిని, ప్రకాశరావు, పద్మనాభం, నాగేశ్వరరావు ఉన్నారు.
- అణగారిన వర్గాల కోసం శ్రమించిన అంబేడ్కర్ ఆశయాలతో ముందుకెళ్లాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌యూపీపీ) రాష్ట్ర నాయకుడు ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. బుధవారం బ్రాడీపేటలోని ఆర్‌యూపీపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించారు. భాస్కరరావు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పాటుపడిన అంబేడ్కర్ సమాజంలో విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె. సతీష్‌బాబు, శిఖా చంద్రమౌళి, సీహెచ్. కృష్ణయ్య, కె.సాయిబాబు, పి. సాంబయ్య పాల్గొన్నారు.
- ప్రతి ఒక్కరికీ సమాన హక్కుల్ని రాజ్యాంగం ద్వారా కల్పించిన అంబేడ్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ సూచించారు. గుంటూరు మార్కెట్ యార్డులో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యార్డు అధికారులు సుబ్రహ్మణ్యం, శివారెడ్డి, పలువురు సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.
- గుంటూరు జీజీహెచ్‌లో అంబేడ్కర్ వర్ధంతిని ఆంధ్రప్రదేశ్ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఆసుపత్రి ఆవరణలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ వెల్ఫేర్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ మేడిద బాబూరావు ముఖ్య అతిథిగా హాజరై, అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు గాబ్రియేల్, రత్నం, సుశీల్‌కుమార్, పాల్గొన్నారు.
- యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతి బాబు ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమానికి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాధారాణి, గాబ్రియేల్, రోజ్‌రాణి, పద్మజ, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసప్రసాద్, డాక్టర్ శౌరయ్య, పాల్గొన్నారు.
- ప్రపంచ దేశాల్లో కెల్లా అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించిన అంబేడ్కర్ చిరస్మరణీయుడని నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.
- అణగారిన వర్గాల ఆర్థిక, సామాజిక సాధికారిత కోసం అంబేడ్కర్ చివరి వరకు చేసిన పోరాటం మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘ రాష్ట్ర సెక్రటరీ మేడిద బాబూరావు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం అంబేడ్కర్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం సంఘ నాయకులు ఎస్. ఐజక్, జి.రమేష్‌బాబు, యోహాను, నాగేశ్వరరావు పాల్గొన్నారు.
- బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేసిన యోధుడు అంబేడ్కర్ అని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ తెలియజేశారు. కాకాని రోడ్డులోని సంఘ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
- రాజ్యాధికారం సాధించే దిశగా మాలలంతా ఐక్యతతో ముందుకు సాగాలని మాల ఐక్య సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బండ్లమూడి స్టాలిన్‌బాబు పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుని లాడ్జి సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డేవిడ్ విలియమ్స్, విల్సన్, మేళం సునీల్‌ప్రకాష్ పాల్గొన్నారు.
- అంబేడ్కర్ ఆశయ సాధనకు నేటి యువత ముందుకు సాగాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని లాడ్జి సెంటర్‌లో వీసీకే పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కె. జయసుధ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘ నాయకులు మద్దు ప్రేమజ్యోతిబాబు, నాయకులు పాల్గొన్నారు.
- మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచ దేశాల్లో కెల్లా అత్యుత్తమ రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు.
- భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు.
- బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చుట్టుగుంటలోని కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి దిశగా ప్రభుత్వాలు ముందుకు సాగాలని సంఘ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ విజ్ఞప్తి చేశారు.
- బహుజన మహాసభ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని కాకుమానువారితోటలోని యనాదీ కాలనీ ట్యూషన్ పాయింట్ వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జూపూడి శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.
- మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని ఓల్డ్ క్లబ్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు డాక్టర్ చిలక వెంకటేశ్వర్లు, కె. వెంకటేశ్వర్లు, కిశోర్, ఆదెయ్య, జక్రయ్య పాల్గొన్నారు.
- అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని దళిత సంఘ నాయకులు క్రిస్టియన్ పేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుడిమెట్ల ఇస్సాక్, బోరుగడ్డ బెన్‌హర్, జస్వంత్, సాల్మన్ శ్రీధర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు తదితరులు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్, యూనియన్ నాయకులు



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్‌యూపీపీ నాయకులు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న నూరిఫాతిమా



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న యార్డు చైర్మన్ తదితరులు



అంబేడ్కర్ భవన్‌లో పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీ వెల్ఫేర్ నాయకులు

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్

పట్నంబజారు: అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా న్యూఢిల్లీలోని అంబేడ్కర్ నేషనల్ మెమోరియల్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహోన్నత వ్యక్తిగా, రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడుగా అంబేడ్కర్‌ను కొనియాడారు. ఆయన సేవల్ని ఆదర్శంగా తీసుకుని నేటి యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.



న్యూఢిల్లీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

పట్నంబజారు: పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ కొనియాడారు. అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం లాడ్జి సెంటర్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ కావటి మాట్లాడుతూ భారత దేశం భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారతదేశానికి రాజ్యాంగాన్ని రూపొందించి అన్ని వర్గాలు అభివృద్ధికి అంబేడ్కర్ కృషి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ మహోన్నత రాజ్యాంగాన్ని రచించి అన్ని దేశాలు భారత దేశం వైపు చూసేలా చేసిన గొప్ప వ్యక్తి అంబేడ్కర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాల పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరావు, పలు డివిజన్‌ల కార్పొరేటర్లు బోడపాటి ఉషారాణి, కిశోర్‌కుమార్, శ్రీవల్లి, ఈచంపాటి వెంకటకృష్ణ పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే గిరి

మార్చి 15, 16 తేదీల్లో ఏఎన్‌యూలో జాతీయ సదస్సు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను బుధవారం వైస్ చాన్స్‌లర్ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బాబూ జగ్జీవన్‌రామ్ కాంట్రిబ్యూషన్స్ టు ఇండియన్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ అండ్ అగ్రికల్చర్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. జగ్జీవన్‌రామ్ ఆలోచనా విధానం, గ్రామీణ అభివృద్ధి, దేశంలో వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఆయన చేపట్టిన చర్యలు, నేటి కాలంలో వాటి ఆవశ్యకతపై ఈ సదస్సులో క్షేత్రస్థాయిలో చర్చ జరగాలని ఆకాంక్షించారు. సదస్సు డైరెక్టర్, జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య కె. మధుబాబు మాట్లాడుతూ 2024 మార్చి 15, 16 తేదీల్లో ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక ఉద్యమ కారునిగా, ప్రజాప్రతినిధిగా, కేంద్ర మంత్రిగా, జగ్జీవన్‌రామ్ మన దేశంలో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగం, ఆహార ధాన్యాల ఉత్పత్తి పెంపుదలకు కృషి చేశారన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆధునిక వంగడాలను ప్రవేశపెట్టడం వంటి అనేక అంశాలపై చట్టాలు, సంస్కరణలు తీసుకురావడానికి ప్రత్యేకంగా కృషి చేశారని వివరించారు. ఆయా అంశాల్లో ఆయన చేపట్టిన సంస్కరణలు, నేటి సమాజంలో వాటి ఆవశ్యకత తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నామని తెలిపారు. న్యూఢిల్లీలోని బాబూ జగ్జీవన్‌రామ్ నేషనల్ ఫౌండేషన్ తోపాటు దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీలలో ఉన్న అధ్యయన కేంద్రాల ప్రతినిధులు హాజరై పరిశోధన పత్రాలు సమర్పించనున్నాయని తెలిపారు. పరిశోధన పత్రాల్ని మార్చి 5వ తేదీలోగా సదస్సు డైరెక్టర్‌కు పంపాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఓఎస్‌డీ ఆచార్య కె. సునీత, సదస్సు ట్రెజరర్ డాక్టర్ కె. సోమశేఖర్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి. అనిత, అధ్యాపకులు డాక్టర్ ఎస్. రత్నకిశోర్, డాక్టర్ పి. శాంసన్, డాక్టర్ మహేంద్ర, డాక్టర్ రాజీవ్, పరిశోధకులు పి. అభిషేక్, వై. రాజేష్, సిబ్బంది ఎస్. ఎజ్రా పాల్గొన్నారు.



జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

పునరావాస కేంద్రాల్లో వసతి, భోజనం ఏర్పాటు

కొమ్మూరు(కాకుమాను):మండలంలోని కొమ్మూరులో అధిక వర్షాల కారణంగా ఇళ్లల్లోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్న పలు కుటుంబాలకు బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి భోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు మాట్లాడుతూ అధిక వర్షాల కారణంగా ఏ ఒక్క కుటుంబం ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంలో ముందస్తుగా తుఫాన్ ప్రభావం ఉన్న ప్రతి జిల్లాకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. నీటి ఉధృతి తగ్గే వరకు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గేరా జ్యోతి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

చేబ్రోలులో..

తుఫాన్ బాధితులకు ఇబ్బంది లేకుండా అధికారులు అండగా ఉండాలని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. వట్లమూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులకు బుధవారం బియ్యం, నిత్యవసర వస్తువులను అందజేశారు. క్రోసూరు, ప్రత్తిపాడు మండలాలకు చెందిన 22 కుటుంబాలకు చెందిన 58మంది జీవనోపాధికి వచ్చి వట్లమూడి గురువుపాలెం వద్ద లోతట్టు ప్రాంతంలో ముంపు బారిన పడటంతో అధికారులు పునరావాస కేంద్రంలో చేర్చారు. బుధవారం వారికి సివిల్ సప్లయి అధికారుల ద్వారా వచ్చిన బియ్యం బస్తాలు, కందిపప్పు, నూనె, కూరగాయలు నిత్యవసర వస్తువుల కిట్లను ఎమ్మెల్యే కిలారి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి, తహసీల్దారు కె.వి.గోపాలకృష్ణ, ఎంపీడీవో బి. బాబూరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, పార్టీ నాయకులు షేక్ పెద మస్తాన్, షేక్ జాని, అహ్మద్, సాగర్ పాల్గొన్నారు.



కొమ్మూరు పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న దృశ్యం

పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం

పెదకాకాని: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి హామీ ఇచ్చారు. తుఫాన్ కారణంగా పెదకాకాని మండలంలోని ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, తెనాలి మండలంలోని హాఫ్‌పేట, ఈమని గ్రామాల్లో దెబ్బతిన్న పంటల్ని కలెక్టర్‌తో పాటు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ పరిశీలించారు. పంట నష్టంపై రైతులతో మాట్లాడారు. అధిక వర్షాలకు పంట పొలాల్లోకి చేరిన నీటిని సాధ్యమైనంత మేర బయటకు పంపాలని రైతులకు సూచించారు. కాలువల్లోని నీరే పొలాల్లోకి వచ్చి చేరుతోందని రైతులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తెచ్చారు. కాలువల్లో నీరు త్వరగా పారుదల కావడానికి నీటి పారుదల శాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పంట నష్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళతానని తెలిపారు. పంట నష్టంపై సర్వే చేసి పరిహారానికి గానూ ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావం కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. అనంతరం ఉప్పలపాడు, నంబూరు శివార్లలో రోడ్డుపై పొంగి పారుతున్న కాలువలను పరిశీలించారు. స్థానిక రైతులు, వ్యవసాయ అధికారులతో కలసి గోళ్లమూడి, నంబూరు గ్రామ శివార్లలో నీటిలో తేలాడుతున్న వరి పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కాలువల్లో నీటి పరిమాణం తగ్గేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో గుంటూరు ఆర్డీవో శ్రీకర్, ఏడీఏ నున్న వెంకటేశ్వర్లు, రవీంద్రబాబు, ఉమామహేశ్వరరావు, పీడీ డ్వామా వెంకటశివరామిరెడ్డి, ఏవో పి. సంధ్యారాణి, ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ నగేష్, శివాలయం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దంతాల వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, నేతలు పల్లెంపాటి శ్రీనివాసరావు, దంతాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దెబ్బతిన్న మినుము పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి,ఎమ్మెల్యే కిలారి

బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణలత పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ''బేసిక్ లైఫ్ సపోర్ట్'' అనే అంశంపై విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి ఈ పద్ధతి ద్వారా ప్రాథమిక చికిత్స అందించి, బతికించవచ్చని తెలిపారు. దీన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించి, విద్యార్థినులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యక్ష్యంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జోత్స్నకుమారి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు కె. సుబ్బరత్నమ్మ, డాక్టర్ డి. ధాత్రీకుమారి, సంతోష్ కుమారి, డాక్టర్ కె. విజయకుమారి, అధ్యాపకులు శాంతి శ్రీదేవి, కమల కరుణ, క్యూరీ, అనూరాధ, పీజీ డాక్టర్లు లావణ్య బృందం పాల్గొన్నారు.



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న స్వర్ణలత బృందం

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు

పెదనందిపాడు: మండలంలోని నల్లమడ, నక్క వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రవాహానికి కట్టలు తెగి గ్రామాల్లోకి వస్తాయని రైతులతో పాటు గ్రామస్తులు భయపడిపోతున్నారు. అన్నపర్రు వెంబడి ప్రవహించే నక్కవాగు ఉగ్రరూపం దాల్చింది. అన్నపర్రు, కొప్పర్రు గ్రామాల మధ్య ఆర్ అండ్ బీ రోడ్డుపై నిర్మించిన కల్వర్టు కోతకు గురైంది. మూడు రోజుల్లో మరమ్మతు చేయనున్నట్లు జేఈ శ్రీనివాసరావు తెలిపారు.